# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం

జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 28 | సోమవారం | 24-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:28 | Monday | 24-8-2026 | Pages:08 | Cost:2/- |








## మళ్లీ పార్లమెంట్ సమావేశాలు!

**రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడతారని ప్రచారం**

**వర్షాకాల సమావేశాలను ఇంకా ప్రోరోగ్ చేయని ప్రభుత్వం**



న్యూఢిల్లీ: ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి, కీలకమైన బిల్లును ఆమోదింపజేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేసిన పది రోజుల తర్వాత కూడా సమావేశాలు ఇంకా అధికారికంగా ముగియలేదు. సాధారణంగా సభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత అధికారికంగా ముగిసినట్లు(ప్రోరోగ్) నాలుగైదు రోజుల్లోగా ప్రకటిస్తారు. కానీ, ఈసారి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు

2లో

## ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం

- కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ తీవ్ర విమర్శలు
- యూడైస్ గణాంకాలతో ప్రభుత్వ వాదనలు అబద్ధమని ఆరోపణ
- ప్రభుత్వ పాఠశాలల్లో 5.56 లక్షల మంది విద్యార్థులు తగ్గారని వెల్లడి
- ప్రైవేటుకు మేలు చేసేందుకే ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తున్నారని విమర్శ
- తమ హయాంలో నాడు-నేడు, ట్యాబ్‌లతో విద్యారంగాన్ని మార్చామని వెల్లడి



ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యా రంగంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తగ్గిపోతున్నారని, కూటమి ప్రభుత్వం మాత్రం అబద్ధపు ప్రచారాలు చేసుకుంటోందని విమర్శించారు.

## యువత కొత్త టెక్నాలజీలను నిర్మిస్తోందన్న మోదీ

**జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు**

**అంతరిక్ష రంగంలో భారత్ పెట్టుబడిదారులకు ఆకర్షణీయ కేంద్రంగా మారిందన్న పీఎం**

**కొత్త టెక్నాలజీలను ఆవిష్కరిస్తున్న జెన్-జీ ఇంజనీర్లపై ప్రధాని ప్రశంసలు**

**చంద్రయాన్-3 ల్యాండింగ్ గుర్తుగా ఆగస్టు 23న అంతరిక్ష దినోత్సవం**

**'వికసిత భారత్' లక్ష్యంతో ఈ ఏడాది అంతరిక్ష దినోత్సవ వేడుకలు**



జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు, శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా దూసుకుపోతోందని, పెట్టుబడిదారులకు ఒక 'ఆయస్కాంతం'లా మారిందని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా జెన్-జీ యువత సరికొత్త టెక్నాలజీలను నిర్మిస్తోందని ప్రశంసించారు. ఆదివారం ప్రధాని మోదీ తన ప్రసంగాలతో కూడిన ఒక వీడియోను పంచుకున్నారు. "అయోధ్యలో నేను చెప్పినట్లుగా ఇది ఒక కొత్త మార్పునకు నాంది. ఈ కొత్త శకంలో, ప్రపంచ క్రమంలో భారత్ తన అంతరిక్ష ఉనికిని స్థిరంగా విస్తరిస్తోంది. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలన్న మన సంకల్పంలో అంతరిక్ష రంగం కీలక పాత్ర పోషిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. దేశ యువతను కొనియాడుతూ "ఈ రోజు మన జెన్-జీ ఇంజనీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతలను ఆవిష్కరిస్తున్నారు. ప్రొపల్షన్ సిస్టమ్స్ నుంచి శాటిలైట్ ప్లాట్‌ఫారమ్‌ల వరకు, మన యువత గతంలో ఊహించని రంగాలలో పనిచేస్తోంది" అని అన్నారు. ఇస్రో విజయాలు ఎంతోమంది పిల్లలకు శాస్త్రవేత్తలు కావాలనే స్ఫూర్తిని ఇస్తున్నాయని చెప్పారు.

- మిగతా 2వ పేజీలో




## లండన్‌లో సీఎం రేవంత్ రెడ్డి 'మీట్ అండ్ గ్రీట్'

- పెట్టుబడులు, విద్యారంగ బలోపేతం, తెలంగాణ అభివృద్ధిపై చర్చలు
- ఎన్నారైలు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, నిపుణులతో సీఎం ముఖాముఖి
- ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ పీసీసీ ఎన్నారై కన్వీనర్ సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు బలమైన మద్దతుదారులు, రాయబారులుగా ఉండాలని సీఎం పిలుపు

లండన్: తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి లండన్ పర్యటనలో భాగంగా ప్రవాస భారతీయులు, ఇండియన్, తెలుగు కమ్యూనిటీ ప్రతినిధులతో ప్రత్యేక 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ లండన్‌లోని ప్రముఖ తాజ్ హోటల్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ పీసీసీ ఎన్నారై కన్వీనర్, ఇండియన్ కమ్యూనిటీ నాయకుడు సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి యూకేలోని తెలుగు కమ్యూనిటీ నాయకులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, ఎన్నారైలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

- మిగతా 2వ పేజీలో

## ఖర్గే వద్ద కొండా సురేఖ పంచాయితీ!

- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో మంత్రి కొండా సురేఖ భేటీ?
- తనపై కుట్ర జరుగుతోందని ఖర్గేకు వివరించిన సురేఖ
- సీఎం, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడొద్దని సురేఖకు ఖర్గే హితవు

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్దకు చేరింది. ఆదివారం బెంగళూరులో ఖర్గేతో మంత్రి సురేఖ సమావేశమైనట్టు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రావడానికి ఒక్కరోజు ముందు ఈ భేటీ జరగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో అంతర్గతంగా ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో సురేఖ నేరుగా అధిష్ఠానాన్ని కలవడం చర్చనీయాంశమైంది. దసుమారు 15 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో కొండా సురేఖ తన వాదనను ఖర్గే ముందు వినిపించినట్లు సమాచారం. తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గానీ, కాంగ్రెస్ పార్టీకి గానీ, గాంధీ కుటుంబానికి గానీ వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఆమె వివరించారు. పార్టీలోని కొందరు నేతలు తనను

- మిగతా 2వ పేజీలో





2లో

## మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్

- ఏపీ మద్యం రవాణా కుంభకోణంలో మాజీ మంత్రి కారుమూరి అరెస్ట్
- హైదరాబాద్ కొండాపూర్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు
- ఇప్పటికే కారుమూరి కుమారుడితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసిన దర్యాప్తు సంస్థ
- రూ.195 కోట్లకు పైగా ఖజానాకు నష్టం జరిగిందని ప్రధాన ఆరోపణ
- ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో తప్పని అరెస్ట్

ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ కాగా, తాజాగా కారుమూరి అరెస్ట్‌తో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఇటీవల కారుమూరి నాగేశ్వరరావు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. జూలై 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ స్కామ్ విలువ రూ.350 కోట్లకు పైగా ఉందని వ్యాఖ్యానిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు కారుమూరిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఏపీలో మద్యం రవాణా టెండర్ల ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్

- మిగతా 2వ పేజీలో

## బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

**గచ్చిబౌలి ఆంజనేయ నగర్‌లో ప్రమాదకర భవనం కూల్చివేత**

**నిన్న కూలిన భవనం పక్కనే దెబ్బతిన్న మరో నిర్మాణం**

**సీఎంసీ, హైడ్రా ఆధ్వర్యంలో సంయుక్త ఆపరేషన్**

**ముందుజాగ్రత్తగా సమీప అపార్ట్‌మెంట్ వాసుల తరలింపు**

**అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు**

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఓ ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో, దాని పక్కనే ప్రమాదకరంగా మారిన మరో బహుళ అంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హైడ్రా బృందాలు సంయుక్తంగా ఆదివారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి.

- మిగతా 2వ పేజీలో





## సమ్మె వద్దు.. సమస్యలు పరిష్కరిస్తాం

- ఆటో, క్యాబ్ డ్రైవర్లకు మంత్రి పొన్నం భరోసా
- నేటి అర్ధరాత్రి నుంచి తలపెట్టిన బంద్‌ను విరమించాలని ఆటో డ్రైవర్లకు మంత్రి పొన్నం విజ్ఞప్తి
- ఛార్జీల సవరణపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ
- ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడి

ఇవాళ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన నిరవధిక బంద్‌ను విరమించుకోవాలని ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మెల ద్వారా సమస్యలు

- మిగతా 2వ పేజీలో



# రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలి

- నూతన పీఏసీఎస్ చైర్మన్లకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సూచన

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** రైతుల సంక్షేమం కోసం సహకార సంఘాలను బలోపేతం చేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నూతన పీఏసీఎస్ చైర్మన్లకు సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో నూతనంగా ఎన్నికైన పోచంపల్లి, జూలూరు పీఏసీఎస్ చైర్మన్లు పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవరెడ్డి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యేకు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి రైతుకు అందేలా పీఏసీఎస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని కోరారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందిస్తూ వారి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు వంగూరి పాండు, సహకార సంఘ చైర్మన్ భారత లవకుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొట్టం కరుణాకర్‌రెడ్డి, మక్తల రమేష్‌గౌడ్, సర్పంచ్ పేరమాండ్ల మహాలక్ష్మి దానయ్య, సీనియర్ నాయకులు ఏర్పుల శ్రీనివాస్, నాగేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య




**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండలంలోని మూసి పరివాహక ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మూసి జలాలకు బదులుగా గోదావరి జలాలను అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు సాధించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్న జిల్లా పాదయాత్రతో పాటు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లెల పెంటయ్య మాట్లాడుతూ.. రామన్నపేట మండల రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూసి జలాలపై ఆధారపడకుండా గోదావరి జలాలను ఈ ప్రాంతానికి అందించి రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి రైతులకు నీరందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పూర్తి కోసం అవసరమైన నిధులను వెంటనే కేటాయించాలని ఆయన కోరారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధన కోసం ఆగస్టు 29, 30, 31 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా పాదయాత్రలో రైతులు, ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాలో కూడా అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు బోయిని ఆనంద్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, శాఖ కార్యదర్శి నాగటి లక్ష్మణ్, సీపీఎం గ్రామ శాఖ నాయకులు బంద జగన్మోహన్‌రెడ్డి, నేమనంది లింగయ్య, బోయిని మల్లేష్, గోగు లింగస్వామి, బోయిని రామచంద్రం, ఆవుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల పాత్రికేయుడు ఇబ్రహీం

- ఆయనతో 40 ఏళ్ల అనుబంధం మరువలేనిది
- పాత్రికేయ మిత్రుడికి సంతాపం తెలిపిన సీతారాములు

**తొలివెలుగు, రామన్నపేట :** ఆంధ్రజ్యోతి దినపత్రిక సీనియర్ పాత్రికేయుడు మహమ్మద్ ఇబ్రహీం మృతి జిల్లా పాత్రికేయ రంగానికి తీరని లోటని సీపీఐ(ఎం) మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు చేరుపల్లి సీతారాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను రామన్నపేట డివిజన్ సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయం నుంచి ఇబ్రహీంతో 40 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తన వార్తల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. వృత్తి పట్ల ఎంతో నిబద్ధతతో వ్యవహరిస్తూ, నిజానిజాలను క్షుణ్ణంగా నిర్ధారించుకున్న తర్వాతే వార్తలు రాసే ఉన్నతమైన వ్యక్తిత్వమని కొనియాడారు. ఒక మంచి పాత్రికేయ మిత్రుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొంటూ, ఇబ్రహీం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.






# బోనమెత్తిన పల్లెలు



- మండల వ్యాప్తంగా ఘనంగా బోనాల మహోత్సవం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండల వ్యాప్తంగా ఆదివారం గ్రామగ్రామాన బోనాల పండుగ ఆధ్యాత్మిక వైభవంగా కొనసాగింది. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సిద్ధం చేసి అమ్మవార్లకు సమర్పించారు. డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాల నడుమ నిర్వహించిన ఊరేగింపులు భక్తులను ఆకట్టుకున్నాయి. పట్టణ కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప, కామరాతి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సిద్ధం చేసి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల నడుమ బోనాలను దేవతలకు సమర్పించారు. అదేవిధంగా పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు బోనాలను తలపై మోసుకుంటూ ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ దేవతకు సమర్పించారు. మండలంలోని పెద్ద రావులపల్లి, జూలూరు, జలాల్పురం, వంకమామిడి, దంతూరు తదితర గ్రామాల్లోనూ బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు తంగేళ్ల దశరథ, మాజీ కౌన్సిలర్ మోటార్ రజిత రాజు, యువజన సంఘం అధ్యక్షుడు కౌడి రాజశేఖర్, నూట మహేష్, గొరిగ నరసింహ, వినోద్, మల్లేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జిల పేరిట 'ఇసుక' దోపిడీ!




- రాజాపేట మండలంలో కాంట్రాక్టర్ల అక్రమ రవాణా
- బేగంపేట వాగును తోడేస్తున్న వైనం.. పర్యవేక్షణ కరవు
- కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్

**తొలివెలుగు, రాజాపేట:** వంతెనల నిర్మాణం పేరుతో బేగంపేట వాగులో ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు రాజాపేట మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కోట్లాది రూపాయల అంచనా వ్యయంతో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు.. నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను నిబంధనల ప్రకారం సమకూర్చుకోవాల్సి ఉన్నప్పటికీ, వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని పారుపల్లి, బేగంపేట, కాల్వపల్లి గ్రామాల సమీపంలో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల సమీపంలోని బేగంపేట వాగులో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వంతెనల వద్ద భారీగా గుంతలు తీసి, తవ్విన ఇసుకను సమీపంలో కుప్పలుగా పోసి నిర్మాణ పనులకు వినియోగిస్తున్నారని పేర్కొంటున్నారు.



**నిబంధనలు పక్కనపెట్టి.. యథేచ్ఛగా పక్కదారి:**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను నిర్దేశిత విధానంలో సమకూర్చుకోవాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు వాగులోని ఇసుకను యథేచ్ఛగా తవ్వుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవైపు వంతెన నిర్మాణ పనులు జరుగుతుండగా, మరోవైపు వాగులో ఇసుక తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహజ వనరులైన ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తే భవిష్యత్తులో వాగు స్వరూపం దెబ్బతినే ప్రమాదం ఉందని వారు అంటున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

వాగులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వంతెనల వద్ద భారీగా ఇసుక కుప్పలు, తవ్వకాల ఆనవాళ్లు కనిపిస్తున్నప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడంపై వారు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణ పనుల కోసం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే ఇసుకను వినియోగిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

**కలెక్టర్ జోక్యానికి డిమాండ్:**

బేగంపేట వాగులో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించాలని గ్రామస్థులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా జరుగుతున్నట్లు తేలితే సంబంధిత కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వంతెన నిర్మాణాల పేరుతో సహజ వనరుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




# ఇరవై ఏళ్లకు అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు

- 2005-06 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**తొలివెలుగు, నిడమనూరు :** నిడమనూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇరవై ఏళ్ల అనంతరం సహచరులంతా ఒకే వేదికపై కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను పూలతో ఘనంగా సన్మానించి వేదికపైకి ఆహ్వానించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ అలనాటి అల్లరి రోజులను గుర్తు చేసుకున్నారు. బాల్యంలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా తిరుగుతూ తాము చదువుకున్న తరగతి గదులు, ఆట స్థలాలు, చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఇరవై ఏళ్ల తర్వాత కూడా స్నేహబంధం అలాగే కొనసాగుతుండటంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ కళ్లముందు చిన్న మొక్కల్లా ఉన్న విద్యార్థులు నేడు పెద్దవారై, వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నత స్థానాల్లో ఎదిగి కనిపించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని తెలిపారు. తమ విద్యార్థులు ఏ రంగంలో ఉన్నా మరింత ఉన్నతంగా రాణిస్తూ జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల నాటి ప్రధానోపాధ్యాయుడు చిన్నపాక వెంకటేశ్వర్లు, పీటీలు అంజయ్య, అక్కయ్య, ఉపాధ్యాయులు రాణి, చంద్రమౌళి, కంప్యూటర్ శ్రీను, పూర్వ విద్యార్థులు శ్రీశైలం, రాజశేఖర్, వీసాల గోవర్ధన్, మధు, అంబేద్కర్, రాంబాబు, మారయ్య, పి. శంకర్, బి. కొండల, హరికృష్ణ, మట్టయ్య, శంకర్, వెంకన్న, లక్ష్మణ్, నరేందర్‌రెడ్డి, కరుణాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





# పీఏసీఎస్ వైస్ చైర్మన్ల ఏకగ్రీవ ఎంపిక

- పోచంపల్లి వైస్ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి, జూలూరు వైస్ చైర్మన్‌గా రమేష్‌గౌడ్
- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండలంలోని పోచంపల్లి, జూలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నూతన కమిటీ వైస్ చైర్మన్ల ఎంపిక ఆదివారం ఏకగ్రీవంగా ముగిసింది. పోచంపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా కొట్టం కరుణాకర్‌రెడ్డి, జూలూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా మక్తల రమేష్‌గౌడ్‌లను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా నూతన వైస్ చైర్మన్లు మాట్లాడుతూ... రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి, రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. తమ ఎంపికకు సహకరించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జూలూరు పీఏసీఎస్ చైర్మన్‌గా కల్లెం రాఘవరెడ్డి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** మండలంలోని జూలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా పిల్లాయిపల్లి గ్రామానికి చెందిన కల్లెం రాఘవరెడ్డిని ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూలూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా మక్తల రమేష్‌గౌడ్‌ను ఎంపిక చేశారు. డైరెక్టర్లుగా కొత్తపల్లి శ్రీశైలం, బొచ్చు యాదమ్మ, సందిని కిషన్, వడ్డేపల్లి జంగయ్య, పకీరు మల్లారెడ్డి, అందేల విజయ్, జడల అంజయ్య, పల్లా విష్ణువర్ధన్‌రెడ్డి, బొబ్బల సుభాష్‌రెడ్డి, దుర్గం శ్రీశైలం, రమావత్ కిషన్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ కల్లెం రాఘవరెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హత కలిగిన రైతుకు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## కాటమయ్య కిట్లతో సంపూర్ణ రక్షణ


- ఊట్కూరు సర్పంచ్ కురుమేటి వసుమతి నరసింహ



**తొలివెలుగు, నిడమనూరు :** కల్లుగీత కార్మికులు తాటి చెట్లను ఎక్కే సమయంలో ప్రమాదాల నుంచి రక్షణ పొందేందుకు కాటమయ్య రక్షక కవచం కిట్లు ఎంతో ఉపయోగపడతాయని ఊట్కూరు సర్పంచ్ కురుమేటి వసుమతి నరసింహ తెలిపారు. ఆదివారం ఊట్కూరు గ్రామంలోని రైతు వేదిక వద్ద కల్లుగీత కార్మికులకు సర్పంచ్ కురుమేటి వసుమతి నరసింహ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ విజయకుమార్‌గౌడ్ కలిసి కాటమయ్య రక్షక కవచం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటి చెట్లపైకి ఎక్కే సమయంలో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఉచితంగా కాటమయ్య రక్షక కవచం కిట్లను అందిస్తోందన్నారు. కార్మికులు ఈ కిట్లను తప్పనిసరిగా వినియోగించుకుని సురక్షితంగా తమ వృత్తిని కొనసాగించాలని కోరారు. కల్లు గీత కార్మిక సొసైటీ పరిధిలో చెట్లపైకి ఎక్కే కార్మికులందరినీ గుర్తించి వారికి రక్షక కవచం కిట్లు అందజేస్తామని తెలిపారు. కిట్లు పొందిన కార్మికులు వాటిని వినియోగిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పర్యవేక్షించాలని, వాటి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, రవి, శ్రీనయ్య, మాజీ ఎంపీటీసీ నరేందర్, వెంకన్న, జానయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనగాం కౌన్సిలర్‌కు నమిలలో ఘన స్వాగతం

- శాలువాలతో సత్కరించి అభినందించిన స్థానికులు



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం నమిల గ్రామంలో జనగాం మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ గునిగంటి వెన్నెల రామకృష్ణకు ఆదివారం ఘన స్వాగతం లభించింది. స్వగ్రామమైన నమిలకు వచ్చిన ఆయనను గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, రైతులు, జర్నలిస్టులు శాలువాలతో గునిగంటి వెన్నెల రామకృష్ణను సత్కరించారు. ఆయనకు ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి రాజు ముదిరాజ్, ఉపసర్పంచ్ మార్క శివ, మాజీ సర్పంచ్ మేకల రమేష్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనకు ఘన స్వాగతం పలికి సత్కరించిన స్వగ్రామ ప్రజలకు, అభిమానులకు జనగాం కౌన్సిలర్ గునిగంటి వెన్నెల రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 'చదువుకోవాలని లేదు.. ఢిల్లీ వెళ్తున్నా!'

- వాకింగ్‌కు వెళ్లి విద్యార్థి మాయం
- ల్యాప్‌టాప్, సర్టిఫికెట్లతో ఇల్లు వదిలిన 19 ఏళ్ల యువకుడు



**తొలివెలుగు, అబ్దుల్లాపూర్‌మెట్:** ఉదయపు నడకకు వెళ్లిన ఓ 19 ఏళ్ల విద్యార్థి అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలైన ఉర్మిళా దిగంబర్ జాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... ఉమర్‌ఖాన్‌గూడ గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ దిగంబర్ జాదవ్ (19) అనే విద్యార్థి ఈ నెల 22న ఉదయం 5.30 గంటలకు రోజువారీగా వాకింగ్‌కు వెళ్లాడు. ఉదయం 7 గంటలైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్పందించలేదు. కొంత సమయం తర్వాత 'నాకు చదువుకోవాలని లేదు.. నేను ఢిల్లీ వెళ్తున్నాను' అని వాట్సాప్‌లో సందేశం పంపాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. ఇంట్లో పరిశీలించగా అతడి ల్యాప్‌టాప్, నాలుగు జతల దుస్తులు, విద్యార్హత సర్టిఫికెట్లు లేకపోవడం గమనించారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పేదలెవరూ ఇళ్లు కోల్పోకుండా సీఎంతో మాట్లాడుతా





- సాహెబ్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లో మధుయాష్కి గౌడ్ పర్యటన
- రోడ్డు విస్తరణ బాధితులకు నేతల భరోసా

**తొలివెలుగు, ఎల్బీనగర్:** సాహెబ్‌నగర్ నుంచి హయత్‌నగర్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో పేదలెవరూ ఇళ్లు కోల్పోకుండా ముఖ్యమంత్రితో పాటు ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారం చూపుతామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హామీ ఇచ్చారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీనియర్ నేత ముద్దగోని రామ్మోహన్‌గౌడ్‌తో కలిసి మధుయాష్కి గౌడ్ ఆదివారం సాహెబ్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లో పర్యటించారు. రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటున్న బాధితులు, గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విస్తరించనున్న రహదారి మార్గాలను పరిశీలించారు. స్థానికులు తమ సమస్యలను మధుయాష్కి గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. 80 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపడితే తాము ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని, తరతరాలుగా నివసిస్తున్న తమ ఇళ్లను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. హయత్‌నగర్‌లో పుట్టి పెరిగిన తనకు సాహెబ్‌నగర్ గ్రామంతో, ఇక్కడి ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తమ ఇంటి ఆడపడుచులు ఇళ్లు కోల్పోతే తనకు ఎంత బాధ కలుగుతుందో, స్థానికులు ఇళ్లు కోల్పోయినా అంతే బాధ కలుగుతుందని పేర్కొన్నారు. బాధితులు తన వద్దకు రావాలని భావించినప్పటికీ, తానే స్వయంగా వచ్చి సమస్యను పరిశీలిస్తానని చెప్పి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. అధికారులు కార్యాలయాల్లో కూర్చొని నిర్ణయాలు తీసుకుంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. రోడ్డు విస్తరణను 80 అడుగులకు కాకుండా ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా 40 అడుగుల వరకు పరిమితం చేసే అవకాశంపై పరిశీలించి, స్థానికుల ఇళ్లు, ఆస్తులు కోల్పోకుండా కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయమై ముఖ్యమంత్రితో, సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి తగిన పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. మల్‌రెడ్డి రాంరెడ్డి, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. సాహెబ్‌నగర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి రెండు వైపులా చేపట్టనున్న రోడ్డు విస్తరణతో స్థానికులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని మధుయాష్కి గౌడ్ దృష్టికి తీసుకువచ్చి, ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. స్థానికులెవరూ ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న, సీనియర్ నాయకులు మకుటం సదాశివుడు, డివిజన్ అధ్యక్షుడు రమేష్ నాయక్, పర్వతి గణేష్‌రెడ్డి, నాయకులు ముద్దగోని సురేష్‌గౌడ్, చంద్రకాంత్‌గౌడ్, నారాయణగౌడ్, సరస్వతి, వినయ్ పటేల్, నగేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, శశికాంత్, రాంబాబు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి

- హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డ సత్యనారాయణ డిమాండ్
- మన్సూరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకుల విలేకరుల సమావేశం



**తొలివెలుగు,మన్సూరాబాద్ :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డ సత్యనారాయణ పోలీసులను కోరారు. మన్సూరాబాద్ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కేసు (నంబర్ సీఆర్ 13261/2026)లో ప్రభాకర్‌రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్‌ను రద్దు చేసిందని, పోలీసులు చట్టప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తనకు జక్కిడి కుటుంబం నుంచి ప్రాణహాని ఉందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. ప్రభాకర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినందుకు పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవికి కృతజ్ఞతలు తెలిపారు. ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిర్మర్తి శేఖర్ మాట్లాడుతూ.. సత్యనారాయణకు న్యాయం జరగకపోతే ఎల్బీనగర్‌లో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. సత్యనారాయణ కుటుంబానికి ఏమైనా జరిగితే ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు శివచరణ్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ గాంధీ నాయక్ ఆరోపించారు. సమావేశంలో వనం గంగయ్య, బి. వెంకటేష్‌గౌడ్, చందులాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా శేఖర్ రెడ్డి

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్ రెడ్డి
- రైతుల సంక్షేమానికి కృషి చేస్తానన్న శేఖర్ రెడ్డి



**తొలివెలుగు, రాజాపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజాపేట మండలం రేణిగుంట గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బూర్గు శేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్ రెడ్డి నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డిని పలువురు నాయకులు, శ్రేయోభిలాషులు అభినందించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతు ప్రయోజనాల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- మోహన్‌నగర్‌లో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆర్. కృష్ణయ్య, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

**తొలివెలుగు, కొత్తపేట:** అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, బీజేపీ నేత బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్‌నగర్ చౌరస్తాలో బోనాల పండుగను పురస్కరించుకుని ఆదివారం బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) ప్రధాన కార్యదర్శి యాష్‌పాల్ గౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారి ఘట్టం, బంగారు బోనం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్. కృష్ణయ్య, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అమ్మవారి కృపాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, పలువురు డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భార్గవ్ గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కుంభం

- రోడ్డు ప్రమాద బాధితుడి కుటుంబానికి ధైర్యం
- త్వరగా కోలుకోవాలని అనిల్ కుమార్‌రెడ్డి ఆకాంక్ష

**తొలివెలుగు, వలిగొండ:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ట్రాస్మా జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు పాలకుర్ల వెంకటేశం గౌడ్ కుమారుడు భార్గవ్ గౌడ్‌ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భార్గవ్ గౌడ్ ఆరోగ్య పరిస్థితి గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. భార్గవ్ గౌడ్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, జానకిరాములు, పీఏసీఎస్ చైర్మన్ గరిసే రవి, పాశం సత్తిరెడ్డి, కాసుల వెంకటేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# వరుణదేవా కరుణించు

- సమృద్ధిగా వర్షాలు కురవాలని.. బొడ్రాయికి జలాభిషేకం
- బసంతాపురంలో ప్రత్యేక పూజలు చేసిన గ్రామస్థులు
- హాజరైన సర్పంచ్ మెండు రత్నమాల, ఎంబీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ భాస్కరరెడ్డి



**తొలివెలుగు, రాజాపేట:** సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని ఆకాంక్షిస్తూ రాజాపేట మండలం బసంతాపురం గ్రామస్థులు ఆదివారం బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామానికి చెందిన మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బొడ్రాయికి నీటితో జలాభిషేకం చేశారు. అనంతరం బతుకమ్మలు ఆడుతూ వరుణదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, పంటలు బాగా పండాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. గ్రామం సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ముక్కోటి దేవతలను వేడుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ మెండు భాస్కరరెడ్డి, గుల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మెండు మహేందర్‌రెడ్డి, మెండు మణికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

- బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందజేత
- హాజరైన కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు పిండికూర మహేష్



**తొలివెలుగు, రాజాపేట :** మండల కేంద్రమైన రాజాపేటలో ఇటీవల మరణించిన సిరిపంగ నరసింహులు కుటుంబాన్ని ఆదివారం బీర్ల ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఫౌండేషన్ ఛైర్మన్ బీర్ల అనిత సౌజన్యంతో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పిండికూర మహేష్ మాట్లాడుతూ... ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడానికి బీర్ల ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆపన్నులకు నిరంతరం సేవలందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐరేని నవీన్, రేగు సిద్ధులు, ఎర్ర గోకుల కిష్టయ్య, కొత్త ఉమేష్, శిగుళ్ళ మల్లేష్, ఎమ్‌డీ హైమద్, ఎర్రగోకుల అశోక్, మృతుని కుటుంబ సభ్యుడు సిరిపంగ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకాదశి వేళ.. పెరట్లో వికసించిన 'బ్రహ్మకమలం'


- జాలో అరుదైన పుష్పానికి ప్రత్యేక పూజలు
- కన్నులపండువగా మంగళహారతులు, బిల్వార్చన
- తిలకించేందుకు తరలివచ్చిన గ్రామస్థులు



**తొలివెలుగు, రాజాపేట :** మండలంలోని జాల గ్రామంలో అరుదైన బ్రహ్మకమల పుష్పం వికసించింది. గ్రామానికి చెందిన ఠాగూర్ భగత్ సింగ్ ఇంటి పెరటి స్థలంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పుష్పం పూసింది. ఏకాదశి నాడే ఈ అరుదైన పువ్వు వికసించడంతో భగత్ సింగ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్నారి ఠాగూర్ శాన్వితో కలిసి పుష్పానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిదళ బిల్వం, మంగళహారతులతో బ్రహ్మకమలానికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అరుదైన, పవిత్రమైన బ్రహ్మకమలం పూసిందన్న విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద సంఖ్యలో భగత్ సింగ్ నివాసానికి తరలివచ్చి పుష్పాన్ని తిలకించారు.

# చక్కెర చేదు.. ఉల్లి ఘాటు!

- భగ్గుమంటున్న నిత్యావసరాల ధరలు
- రూ.70కి చేరిన కిలో చక్కెర.. ఉల్లి రూ.60
- సతమతమవుతున్న సామాన్యులు, హోటల్ నిర్వాహకులు




**తొలివెలుగు, జన్నారం:** నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోంది. జన్నారం మండలంలో గత కొన్ని రోజులుగా చక్కెర, ఉల్లిపాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వంటింట్లో వినియోగించే వస్తువుల ధరలు పెరగడంతో ఖర్చులు ఎలా తగ్గించుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు రోజుల్లోనే రూ.20 పెంపు:**

చక్కెర ధర గతంలో కిలో రూ.45 నుంచి రూ.55 వరకు ఉండగా.. నాలుగైదు రోజుల వ్యవధిలోనే రూ.70కి చేరినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో కిలో చక్కెరపై ఏకంగా రూ.15 నుంచి రూ.20 వరకు ధర పెరిగింది. ఒక్కసారిగా ధరలు పెరగడంతో వినియోగదారులు అవాక్కవుతున్నారు.

**ఉల్లి ఘాటు.. రూ.60కి చేరిన ధర:**

వంటింట్లో నిత్యం వినియోగించే ఉల్లిపాయల ధర కూడా పెరిగింది. ప్రస్తుతం జన్నారం ప్రాంతంలో కిలో ఉల్లి రూ.60 వరకు విక్రయిస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. ఉల్లి ధర పెరగడంతో గృహిణులు వంటింటి ఖర్చులను సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

**టీ ధరకు రెక్కలు:**

చక్కెర ధర పెరగడం హోటల్ నిర్వాహకులపైనా ప్రభావం చూపుతోంది. పెరిగిన ముడిసరుకు ధరల భారాన్ని భరించలేక స్థానిక హోటళ్లలో టీ ధరను రూ.10 నుంచి రూ.12కు పెంచినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో రోజువారీగా టీ తాగే వినియోగదారులపై కూడా అదనపు భారం పడుతోంది.

**సామాన్యులపై ధరల మోత:**

ఇప్పటికే కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న తమపై చక్కెర, ఉల్లి ధరల పెంపు మరింత భారాన్ని మోపుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలవారీ ఆదాయంలో ఎక్కువ మొత్తం నిత్యావసరాలకే వెచ్చించాల్సి వస్తోందని, కుటుంబ బడ్జెట్‌ను ఎలా సమకూర్చుకోవాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. నిత్యావసరాల ధరలను నియంత్రించి సామాన్యులకు ఉపశమనం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# భక్తిశ్రద్ధలతో ఏకాదశి నగర సంకీర్తన





- మారుమోగిన హరే రామ నామస్మరణ
- శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు

**తొలివెలుగు, రాజాపేట :** మండల కేంద్రమైన రాజాపేటలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నగర సంకీర్తన శోభయాత్ర వైభవంగా సాగింది. స్థానిక శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుంచి ప్రారంభమైన ఈ సంకీర్తన ప్రధాన వీధుల గుండా సాగుతూ ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మందిరంలో అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ భక్తులకు గోత్రనామార్చనలు జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులంతా సామూహికంగా భావానంద అష్టకాన్ని పఠించారు. మర్క్యాక్ శ్రీ భావానంద స్వామివారి ఆశీస్సులతో, అదరాసపల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో రాజాపేట శాఖ అధ్యక్షుడు నంగునూరు రాజు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో నంగునూరు రాజు, బిర్రు శ్రీనివాసులు, కూనూరు బిక్షపతి, నాళ్ల శేఖర్, రేపాక భాగ్యలక్ష్మి, చామకూర అరుణ, నాల్ల పద్మ, బోగలత, పరమేశ్వరి, నంగునూరు జగదాంబ, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహునికి 'పవిత్ర' సమర్పణ





- యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు
- నేటితో ముగియనున్న తిరువేడుకలు
- స్వామి, అమ్మవార్లకు 108 నూలుపోగుల పవిత్రల ధారణ

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఆలయంలో తిరుమంజనం, యజ్ఞశాలలో మంటప ద్వారతోరణ పూజ, మూర్తి కుంభారాధన, పవిత్ర ఆరాధన, పవిత్ర అధివాస కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**వైభవంగా హవనాలు.. ప్రత్యేక పూజలు:**

నృసింహ, మహాలక్ష్మి, సుదర్శన మూలమంత్ర మూర్తి మంత్ర హవనాలతో పాటు నిత్య పూర్ణాహుతి, ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. సాయంత్రం సుదర్శన చక్రానికి షోడశోపచార ఆరాధన చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో వేదమంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**108 నూలుపోగులతో పవిత్రలు:**

పవిత్రోత్సవాల్లో ప్రధాన ఘట్టంగా 108 నూలుపోగులతో ప్రత్యేకంగా తయారు చేసిన పవిత్రలను అధివాసాలు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. అలాగే శ్రీచక్ర పెరుమాళ్లు, సుదర్శన చక్రానికి పవిత్రలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఈ వేడుకలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు కాందూరి వేంకటాచార్యులు, సురేంద్రచార్యులు, శ్రీధరాచార్యులు, మాధవాచార్యులు,



శ్రీనాథాచార్యులు, మంగళగిరి నరసింహమూర్తి, వజ్జల లక్ష్మణాచార్యులతో పాటు ఆలయ అధికారులు సురేందర్‌రెడ్డి, గజ్వేల్ రఘు, వాసం వెంకటేశ్వర్లు, నాగరాజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి.



## వైభవంగా సామూహిక బోనాల ఉత్సవం

- అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని ఆకాంక్ష

**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ పట్టణంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించిన సామూహిక బోనాల మహోత్సవంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా కలిసికట్టుగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఇటువంటి ఉత్సవాలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో వలిగొండ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస బోనాలు

- గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించిన భక్తులు
- అత్యంత వేడుకగా గ్రామ బోనాలోత్సవాలు



**తొలివెలుగు, నిడమనూరు:** మండల పరిధిలోని శాఖాపురం గ్రామంలో ఆదివారం శ్రావణ మాస బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చేకూరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామదేవతలైన ఈదమ్మ, ముత్యాలమ్మలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. బొడ్రాయి వద్ద కూడా పూజా కార్యక్రమాలు చేపట్టి గ్రామం సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో బోనాలను శిరస్సున ధరించి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం గ్రామదేవతలకు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లపుదాసు సోవమ్మ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ కుల సంఘాల నాయకులు, యువకులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామివారి సేవలో ఎమ్మెల్యే కసిరెడ్డి

- యాదగిరిగుట్టలో కల్వకుర్తి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు
- ఘన స్వాగతం పలికిన ఆలయ అర్చకులు, అధికారులు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వేద పండితులు, అర్చకులు ఎమ్మెల్యేకు వేదమంత్రాల మధ్య వేదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధల వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు కాండూరు వెంకటాచార్యులు, సురేంద్ర ఆచార్యులు, శ్రీనాథ ఆచార్యులు, శ్రీధరాచార్యులతో పాటు ఆలయ అధికారులు గజ్వేల్ రఘు, సురేందర్‌రెడ్డి, వాసం వెంకటేశ్వర్లు, నాగరాజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# పత్రికా స్వేచ్ఛ లేకుంటే ప్రజాస్వామ్య సారానికే విఘాతం



దేశంలో పాత్రికేయుల రక్షణ కోసం సమగ్రమైన వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, పటిష్టమైన చట్టపర రక్షణ వ్యవస్థలు పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోకపోవడంపట్ల సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛకు, భావప్రకటన స్వేచ్ఛకు ఎదురవుతున్న అడ్డంకులపై జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు, వ్యవస్థలు విఫలమవుతున్న తీరుపై ఆయన మాట్లాడారు. దక్షేత్రస్థాయిలో నిజాలను వెలికితీసే జర్నలిస్టులకు భద్రత కల్పించేలా సమర్థవంతమైన చట్టాలు, కార్మిక భద్రతా నిబంధనలు అమలులోకి రాకపోవడం వల్ల జర్నలిస్టులు తీవ్రమైన ఒత్తిళ్లను, ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులు చట్టబద్ధంగా పనిచేస్తున్న క్రమంలో, ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులు, ఇతర వర్గాల నుంచి వారిపై జరుగుతున్న దాడులు, అణచివేత చర్యలను అడ్డుకోవడానికి జర్నలిస్ట్ సంఘాలు, ఫెడరేషన్లు సమష్టిగా చట్టపరమైన వేదికలను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే భావప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని, ఇవి లేకపోతే ప్రజాస్వామ్యం తన సారాన్ని కోల్పోతుందని చెప్పారు. వర్తమాన మీడియా రంగంలో వస్తున్న మార్పులను ప్రస్తావిస్తూ.. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో నిబద్ధత కలిగిన పాత్రికేయుల పాత్ర ఎప్పటికీ ఎంతో విలువైనదని పేర్కొన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, యూట్యూబ్ చానెళ్లు ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ సంప్రదాయ జర్నలిజం ప్రాముఖ్యత ఎప్పటికీ తగ్గదని, డిజిటల్ కాలంలో రిపోర్టింగ్ ప్రాథమిక సూత్రాలను పాటించడం మరింత అవసరమని 'ది హిందూ' గ్రూప్ డైరెక్టర్, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ఎన్.రామ్ స్పష్టం చేశారు. మీడియాపై ప్రజలకు విశ్వసనీ యత పెరగాలంటే జర్నలిజం తన మూలాలైన క్షేత్రస్థాయి వార్తల కవరేజి, పరిశోధనాత్మక వార్తలు, వివరణాత్మక వార్తల వైపు మళ్లాల్సిందేనని హితవు పలికారు. మీడియా సంస్థలు స్వీయ నియంత్రణ వ్యవస్థలను మరింత బలోపే తం చేసుకోవాలని, జర్నలిస్టుల కోసం పారదర్శకమైన ప్రవ ర్తనా నియమావళిని పాటించాలని సూచించారు. పాఠశాల స్థాయిలోనే మీడియాపై అవగాహన కల్పించాలని, దీనివల్ల విద్యార్థులు వార్తలను, సమాచారాన్ని సరిగ్గా అర్థం చేసు కుని, విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించుకోగలరని అభి ప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛను బలోపేతం చేయడానికి, జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడానికి, వృత్తిగత ప్రమాణాలను పెంపొందించడానికి ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ 'హైదరాబాద్ డిక్లరేషన్'ను ఆమోదించింది. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, 'ది కారవాన్' మేగజైన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ హర్తోష్ సింగ్ బాల్, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు సంగీతా బరూహ్ పిషారోటి, ఫెడరేషన్ అధ్యక్షుడు గౌతమ్ లహరి, ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు సంగీత, దేశంలోని వివిధ ప్రెస్‌క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్ వరికుప్పల, ఇతర కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## రైతు దారుణ హత్య

- చనగలగుట్ట ప్రాంతంలో మృతదేహం లభ్యం
- రంగంలోకి దిగిన క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్
- కేసు నమోదు చేసిన చౌటుప్పల్ పోలీసులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంతంగి గ్రామం చనగలగుట్ట వద్ద ఓ రైతు దారుణ హత్యకు గురయ్యాడు. ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనతో పంతంగి, అంకిరెడ్డిగూడెం గ్రామాల్లో విషాదం నెలకొంది. అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రాపోలు దానయ్య (36) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చనగలగుట్ట వద్ద దానయ్య హత్యకు గురైనట్లు సమాచారం అందడంతో చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పరిశీలించి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. హత్య ఘటనపై క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించిన పోలీసులు సంఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. హత్యకు ఉపయోగించిన వస్తువులు, నిందితులకు సంబంధించిన ఆధారాల కోసం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. వ్యక్తిగత కక్షలేమైనా ఉన్నాయా? ఇతర కారణాలతో హత్య జరిగిందా? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. నిందితుల ఆచూకీ కోసం దర్యాప్తును వేగవంతం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపారు.



దానయ్య (ఫైల్ ఫోటో)



## హెటిరో కంపెనీని తక్షణమే మూసివేయాలి

- దొతిగూడెం పారిశ్రామిక ప్రమాదంపై బీఎస్పీ ఆగ్రహం
- మృతుల కుటుంబాలకు రూ.5 కోట్ల పరిహారం ఇవ్వాలి
- బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: బీఎస్పీ నేత తగరం సుభాష్

**తొలివెలుగు, చౌటుప్పల్/యాదాద్రిభువనగిరి:** భూదాన్ పోచంపల్లి మండలం దొతిగూడెం గ్రామ పరిధిలోని హెటిరో కంపెనీలో జరిగిన ఘోర పారిశ్రామిక ప్రమాదం అత్యంత విషాదకరమని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ అన్నారు. ప్రమాదంలో కార్మికులు మృతి చెందడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**కంపెనీని శాశ్వతంగా మూసివేయాలి:**

కార్మికుల భద్రతను పట్టించుకోకుండా నడుస్తున్న హెటిరో కంపెనీని తక్షణమే శాశ్వతంగా మూసివేసి, ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని సుభాష్ డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడితే బీఎస్పీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రమాదానికి బాధ్యులైన కంపెనీ యాజమాన్యం, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**రూ.5 కోట్ల పరిహారం.. ఒకరికి ఉద్యోగం:**

ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 కోట్ల నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం పూర్తిగా ఉచితంగా అందించాలని, వారికి తగిన పరిహారం చెల్లించాలని కోరారు.

**పరిశ్రమల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలి:**

జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణాల కంటే కంపెనీల లాభాలు ఎక్కువ కాదని, ప్రభుత్వం ఈ ఘటనపై వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కత్తుల పరమేష్, మాధ రమేష్, నర్సింహా, సుక్క రాములు, ఉదయ్ కిరణ్, కత్తుల నర్సింహా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా 'గురు పురస్కార' మహోత్సవం

- బొబ్బిళ్ల మురళీ గురుస్వామికి 'ఉత్తమ గురు పురస్కారం'
- శబరిమల పందళ రాజు చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- 118 మంది గురుస్వాములకు పురస్కారాల అందజేత

**తొలివెలుగు, హైదరాబాద్/ చౌటుప్పల్:** హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో శ్రీ మహాశాస్త్ర సేవా సంఘం ఆధ్వర్యంలో 'గురు పురస్కార' అవార్డు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్‌కు చెందిన శ్రీ సత్యదేవ సహిత అయ్యప్పస్వామి దేవాలయం వ్యవస్థాపక చైర్మన్ బొబ్బిళ్ల మురళీ గురుస్వామికి 'ఉత్తమ గురు పురస్కారం' లభించింది. శబరిమల అయ్యప్ప వంశస్థులు, పందళ రాజు శ్రీ తిరునాల్ సురేష్ వర్మ చేతుల మీదుగా మురళీ గురుస్వామి ఈ పురస్కారాన్ని స్వీకరించారు. అయ్యప్ప స్వామి సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తుల్లో ధార్మిక చైతన్యం పెంపొందించేందుకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**118 మంది గురుస్వాములకు పురస్కారాలు:**

మహాశాస్త్ర సేవా సంఘం వ్యవస్థాపకులు సూదగాని రాజు గురుస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 118 మంది గురుస్వాములకు 'గురు పురస్కారాలు', 'అన్నపూర్ణ అవార్డులు' అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి సేవల్లో గురుస్వాముల పాత్రను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ బాలరాజు గురుస్వామి, ప్రదీప్ తంత్రి గురుస్వామి, తంగవేలు సంతోష్ గురుస్వామి, భరణి వెంకటేష్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.






## తీవ్ర హెచ్చుతగ్గుల్లో సూచీలు

ముంబై, ఆగస్టు 5 : దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనయ్యాయి. వరుసగా నాలుగోసారి రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడం మార్కెట్ వర్గాలను రుచించలేదు. ఒక దశలో 800 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 152 పాయింట్లు అందుకొని 78,581 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 9.75 పాయింట్లు అందుకొని 24,624.65 వద్ద నిలిచింది. బ్లూచిప్ సంస్థల షేర్లతోపాటు బ్యాంకింగ్, వాహన, క్యాపిటల్ గూడ్స్ షేర్లు లాభాల్లోకి రావడం కలిసొచ్చింది. అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ, ఎస్బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగియగా..టీసీఎస్, హెచ్‌సీఎల్, రిలయన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు నష్టపోయాయి.

## బొండాడ లాభం 53 కోట్లు





హైదరాబాద్, ఆగస్టు 5 : రాష్ట్రానికి చెందిన ఇంజినీరింగ్ సేవల సంస్థ బొండాడ ఇంజినీరింగ్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.53 కోట్ల లాభాన్ని ఆర్జించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.38.2 కోట్ల లాభంతో పోలిస్తే 38 శాతం ఎగబాకింది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 24 శాతం ఎగబాకి రూ.691.6 కోట్లకు చేరుకున్నది. కంపెనీ తాజాగా ఏరోస్పేస్, రక్షణ రంగ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన కేసీఎస్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్‌లో 75 శాతం వాటాను కొనుగోలు చేసింది.

## కేంద్రం కొత్త బిల్లు.. ఆ కంపెనీలకు 15 ఏళ్లు నో ట్యాక్స్!

దేశాన్ని ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన పన్నులు, ఇతర చట్టాల (సవరణ) బిల్లు-2026లో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి సంబంధించిన ఆదాయపు పన్ను రాయితీలను గణనీయంగా విస్తరించాలని ప్రతిపాదించింది. పెట్టుబడులు పెంచడం, తయారీ రంగానికి ఊతమివ్వడం, విదేశీ పెట్టుబడిదారులకు పన్ను పరమైన స్పష్టత కల్పించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటి వరకు పరిమిత కాలానికే ఉద్దేశించిన పన్ను మినహాయింపులను ఇప్పుడు 15 ఏళ్లకు పొడిగించాలని ప్రతిపాదించారు. ఈ మార్పు ప్రకారం, విదేశీ కంపెనీలు భారతీయ కాంట్రాక్ట్ తయారీ సంస్థలకు యంత్రాలు, క్యాపిటల్ ఎక్విప్‌మెంట్, టూలింగ్ వంటి పరికరాలను అందించి, భారత్‌లో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ చేపట్టే సందర్భంలో వచ్చే ఆదాయంపై 2040-41 ఆర్థిక సంవత్సరం వరకు పన్ను మినహాయింపు లభించనుంది. పరిశ్రమ ప్రతినిధులతో జరిగిన సంప్రదింపుల తర్వాత మొదట ప్రతిపాదించిన ఐదేళ్ల గడువును మరో పదేళ్లు పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ రాయితీల పరిధిలో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, పర్సనల్ కంప్యూటర్లు, సర్వర్లు, వాటి కీలక భాగాలు వంటి ఉత్పత్తులు ఉన్నాయి. దీంతో దేశీయ తయారీ సంస్థలపై మూలధన భారం తగ్గడంతో పాటు, అంతర్జాతీయ బ్రాండ్లు భారత్‌లో మరింత విస్తృతంగా తయారీ కార్యకలాపాలు చేపట్టే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి ఇది మరింత బలాన్ని చేకూర్చనుంది. అంతేకాదు, భారతీయ తయారీ యూనిట్లకు అవసరమైన విడిభాగాలను విదేశీ సంస్థలు సమీప గిడ్డంగుల్లో నిల్వ ఉంచినప్పుడు ప్రస్తుతం వర్తించే 2 శాతం పన్నును కూడా 15 ఏళ్లపాటు మినహాయించాలని బిల్లులో ప్రతిపాదించారు. దీని వల్ల సరఫరా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారడంతో పాటు, ఉత్పత్తి ప్రక్రియలో అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, గ్లోబల్ ఫండ్ మేనేజర్లను భారత్‌కు ఆకర్షించేందుకు కూడా ప్రభుత్వం కీలక మార్పులు ప్రతిపాదించింది. ప్రస్తుతం విదేశీ ఫండ్ మేనేజర్లు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించాలంటే అనేక నిబంధనలు పాటించాల్సి ఉండగా, వాటిలో ఎక్కువ భాగాన్ని తొలగించాలని బిల్లు సూచిస్తోంది. అయితే భారతీయ పెట్టుబడిదారులు ఈ నిబంధనలను దుర్వినియోగం చేయకుండా తగిన రక్షణ చర్యలు మాత్రం కొనసాగనున్నాయి. ఈ చర్యలతో భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడులకు మరింత అనుకూల గమ్యస్థానంగా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.



# యూపీఐ పేమెంట్స్‌పై చార్జీలు?




ఇన్నాళ్లూ డిజిటల్ పేమెంట్స్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ వచ్చిన మోదీ సర్కార్.. ఇక ఈ జోరుకు బ్రేకులు వేసే దిశగా వెళ్లనున్నది. అవును.. మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ చట్టం 2007కు సవరణలను ప్రతిపాదించింది. దీనివల్ల యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్లు (ఎండీఆర్) మళ్లీ రాబోతున్నాయి. అయితే యూపీఐ సేవల విస్తరణ తదుపరి వృద్ధికి నిధుల కోసమే ఈ సవరణలు అని తెలుస్తుండగా.. సదరు చట్ట సవరణతో యూపీఐ చెల్లింపులపై చార్జీలుపడే వీలుందన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయిప్పుడు.

**ఇదీ సంగతి..**

పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్ 2007కు సవరణలు చేస్తే యూపీఐపై ఎండీఆర్‌ను విధించడానికి కేంద్ర ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. అలాగే ప్రస్తుతం సెక్షన్ 10ఏ కింద జీరో ఎండీఆర్ నిబంధనను రద్దు చేయవచ్చు. నిజానికి ఈ నిబంధన వల్లే ఆన్‌లైన్ పేమెంట్స్‌పై బ్యాంకులు, పేమెంట్స్ సిస్టమ్ ప్రొవైడర్స్ (పీఎస్‌పీలు)చార్జీలు వసూలు చేయడం లేదు. చట్ట సవరణతో చార్జీలు అమల్లోకి వస్తాయి. రూ. 2వేలకు మించిన లావాదేవీలపై 0.3 శాతం నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్‌ను విధించే యోచనలో ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే వార్షిక టర్నోవర్ రూ. 1.5 కోట్లు దాటిన వ్యాపారులపైనే ఈ భారం ఉండవచ్చని తెలుస్తున్నది. దీనివల్ల అంతిమంగా కొనుగోలుదారులపైనే భారం పడుతుందన్న ఆందోళనలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

**ఉదాహరణకు..**

ఓ కస్టమర్ రూ. 1,000 విలువైన వస్తువును ఓ షాపులో కొన్నారు. క్రెడిట్, డెబిట్ కార్డు లేదా యూపీఐ యాప్ ద్వారా చెల్లించారు. జీరో ఎండీఆర్ పాలసీ వల్ల ఇప్పుడు ఈ పేమెంట్‌ను కస్టమర్‌కు చెందిన బ్యాంక్, వ్యాపారికి చెందిన బ్యాంక్‌లతోపాటు పీఎస్‌పీలు ఉచితంగానే ప్రాసెస్ చేస్తున్నాయి. దీనివల్ల సదరు వస్తువును అమ్మిన వ్యాపారి ఖాతాలో రూ. 1,000 జమ అవుతున్నది. అయితే జీరో ఎండీఆర్ పాలసీ రైద్దైతే కస్టమర్ పేమెంట్‌ను ప్రాసెస్ చేసినందుకు బ్యాంకులు, పీఎస్‌పీలు వ్యాపారుల దగ్గర చార్జీలను వసూలు చేస్తాయి. దీనివల్ల వ్యాపారి ఖాతాలో రూ. 1,000 కంటే తక్కువ జమవుతుంది. అయితే నష్టపోతున్న సదరు చార్జీ మొత్తాన్ని వ్యాపారులు కస్టమర్ దగ్గరే వసూలు చేసే వీలుందని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ప్రభుత్వ పెద్దలు తాము కస్టమర్ల పేమెంట్స్‌పై చార్జీలు వేయట్లేదంటున్నా.. ప్రాసెసింగ్ లేదా అదనపు చార్జీల పేరిటనో, వస్తువు ధరను పెంచో వ్యాపారులు కొనుగోలుదారుల వద్దే ఆ చార్జీలను రాబడుతారని హెచ్చరిస్తుండటం గమనార్హం. పైగా దీనివల్ల నెమ్మదిగా యూపీఐ లావాదేవీలు తగ్గుముఖం పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని వారంటున్నారు. పాత పెద్ద నోట్ల రద్దుతో దేశంలో ఆన్‌లైన్ చెల్లింపులను కేంద్రం ప్రోత్సహించిన సంగతి విదితమే.

**పార్లమెంటరీ కమిటీ సూచన?**

ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ ఏడాది మార్చిలో ఇచ్చిన నివేదిక ప్రకారం దేశంలో ఇప్పుడు జరుగుతున్న అన్ని డిజిటల్ లావాదేవీలలో దాదాపు 88 శాతం యూపీఐ ఆధారంగా చేస్తున్నవే. బ్యాంకులు, పీఎస్‌పీలు ప్రతి నెలా సుమారు రూ. 30 లక్షల కోట్ల విలువైన 23 బిలియన్లకుపైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్నాయని కూడా కమిటీ తెలిపింది. ఈ క్రమంలోనే జీరో ఎండీఆర్ పాలసీ.. యూపీఐ ఎకోసిస్టమ్‌ను దీర్ఘకాలంలో ఆర్థికంగా అస్థిరపర్చగలదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అందుకే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా చర్యలకు దిగినట్టు చెప్తున్నారు.జబతీతీవఅఏఅవం ఢ ఖీశీతీవఅస్త్రఅ జుఇఎష్త్రుఅస్త్రవ

**ఇండస్ట్రీ మాటేంది?**

గత ఏడాది మార్చిలో పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కేంద్రానికి ఓ లేఖను సమర్పించింది. యూపీఐ, రూపే డెబిట్ కార్డ్ లావాదేవీలపై జీరో ఎండీఆర్ పాలసీని పునఃసమీక్షించాలని అందులో ఈ మెజారిటీ బ్యాంకింగేతర చెల్లింపుదారుల సంఘం కోరింది. జీరో ఎండీఆర్ విధానంతో ఆర్థిక అస్థిరత ఏర్పడే ప్రమాదముందన్నది. అందుకే రూపే డెబిట్ కార్డులపై వ్యాపారులందరికీ ఎండీఆర్‌ను ప్రతిపాదించింది. అలాగే బడా వ్యాపారులకు యూపీఐపై 0.3 శాతం ఎండీఆర్ చార్జీలు వేయాలన్నది.ఎండీఆర్ అంటే ఏమిటి? కొనుగోలుదారులు నిత్యం రకరకాల దుకాణాలు, షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు, మరెన్నో చోట్ల చేసే ఆన్‌లైన్ (యూపీఐ) చెల్లింపుల (గూగుల్ పే, ఫోన్‌పే మొదలైనవాటి ద్వారా)ను బ్యాంకులు, పీఎస్‌పీలు ప్రాసెస్ చేస్తాయి. ఇందుకుగాను ఆయా వ్యాపారులు వాటికి చెల్లించే ఫీజునే మర్చంట్ డిస్కౌంట్ రేట్ లేదా ఎండీఆర్ అంటారు. 2020 నుంచి యూపీఐ, రూపే డెబిట్ కార్డు లావాదేవీలకు ఎండీఆర్ 0%గానే ఉంటున్నది. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించడానికి అటు కస్టమర్లకు, ఇటు వ్యాపారులకు జీరో ఎండీఆర్ పాలసీని కేంద్రం వర్తింపజేస్తున్నది.

# వ్యూహాత్మక ఖనిజంగా బంగారం!

ముంబై, ఆగస్టు 4: బంగారాన్ని వ్యూహాత్మక ఖనిజంగా వర్గీకరించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) సూచించింది. దేశీయంగా మైనింగ్‌ను ఉత్సాహపర్చేందుకు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకొనేందుకు ఇది అవసరమని పేర్కొన్నది. గోల్డ్ మైనింగ్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతులతో సంబంధం లేకుండా కేంద్రం నుంచే అనుమతులు వచ్చేలా.. అదికూడా సింగిల్ విండో క్లియరెన్స్ మెకానిజమ్‌ను తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని గనుల మంత్రిత్వ శాఖతో జరిగిన చర్చల్లో డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ అన్నారు. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో ఆయన పీటీఐకి తెలియజేశారు. కాగా, ఏడాదిపాటు బంగారాన్ని దేశ ప్రజలు కొనవద్దని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆమధ్య పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇది.. దేశంలోకి వచ్చే పసిడి దిగుమతుల్ని తగ్గించడానికేనని ప్రభుత్వం చెప్పుకొచ్చిన సంగతీ విదితమే. దేశీయ దిగుమతుల్లో ఇంధనం తర్వాత వాటా పుత్తడిదే మరి. గల్ఫ్ వార్ కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరల దృష్ట్యా.. ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి డాలర్లను అధికంగా చెల్లించాల్సి వస్తుండటంతో.. తగ్గే బంగారం దిగుమతులతో ఆ మిగిలిన డాలర్లను అందుకు ఉపయోగించుకోవచ్చన్నది సర్కార్ యోచన. అయితే దేశంలోనే బంగారం తవ్వకాలు పెరిగితే.. ఈ సమస్య ఉండదని డబ్ల్యూజీసీ అంటున్నది.



## యాపిల్ కీలక నిర్ణయం!



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రోజురోజుకూ వేగంగా విస్తరిస్తూ.. సైబర్ సెక్యూరిటీ రంగంపైనా ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో.. టెక్ దిగ్గజం యాపిల్ కీలక నిర్ణయం తీసుకుంది. సెక్యూరిటీ పరిశోధకులు ఒకేసారి సమర్పించగలిగే సెక్యూరిటీ రిపోర్టుల సంఖ్యపై పరిమితి విధించింది. దీనికి ప్రధాన కారణం.. చాట్‌జీపీటీ వంటి ఏఐ టూల్స్ సహాయంతో పెద్ద ఎత్తున భద్రతా లోపాలకు సంబంధించిన సమస్యలు రావడమే. దీంతో ప్రతి రిపోర్టును పరిశీలించడం యాపిల్ బృందానికి భారంగా మారిందని కంపెనీ తెలిపింది. యాపిల్‌లో ప్రతి సెక్యూరిటీ రిపోర్టును నిపుణులు విడిగా పరిశీలించి, అందులో నిజంగా లోపం ఉందా?, లేదా?.. అనే విషయాన్ని నిర్ధారిస్తారు. కానీ.. ఇటీవల ఏఐ సృష్టించిన అనేక రిపోర్టుల్లో వాస్తవానికి సంబంధం లేని లేదా.. కేవలం ఊహాజనిత సమస్యలు ఎక్కువగా ఉండటంతో, వాటిని పరిశీలించడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఈ కారణంగా నిజమైన భద్రతా లోపాలను గుర్తించి వాటికి పరిష్కారం చూపే ప్రక్రియ ఆలస్యం కావచ్చని కంపెనీ భావించింది. అందుకే ఒకేసారి ఓపెన్‌గా ఉంచే సెక్యూరిటీ రిపోర్టుల సంఖ్యపై పరిమితి విధించడం జరిగింది. అయితే.. ఏఐ వల్ల ప్రతికూలతలే కాకుండా ప్రయోజనాలు కూడా ఉన్నాయని యాపిల్ చెబుతోంది. కొన్ని ఏఐ సిస్టమ్‌లు మ్యాక్‌ఓఎస్‌లో చాలా తక్కువ సమయంలోనే 50కు పైగా సంభావ్య భద్రతా లోపాలను గుర్తించాయి. వాటిలో కొన్ని చాలా కీలకమైనవిగా ఉండటంతో యాపిల్ వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ల ద్వారా వాటిని పరిష్కరించింది. ప్రస్తుతం యాపిల్ తన బగ్ బౌంటీ ప్రోగ్రామ్ ద్వారా నిజమైన సెక్యూరిటీ లోపాలను గుర్తించిన పరిశోధకులకు లోపం తీవ్రతను బట్టి గరిష్ఠంగా 5 మిలియన్ డాలర్ల వరకు బహుమతిని కూడా అందిస్తోంది. అయితే కొత్త పరిమితుల వల్ల భవిష్యత్తులో కొన్ని కీలకమైన నిజమైన రిపోర్టులు కూడా ఆలస్యంగా పరిశీలించే అవకాశం ఉందని సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

## రమ్యకృష్ణ కూడా కీ రోల్

అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది.ఈ చిత్రంలో దీపిక పదుకొణెళ ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.





# ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు ర్యూమర్స్


## వదంతులను తోసిపుచ్చిన చిత్ర బృందం

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక్ వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకున్నారంతే. దయచేసి ఎవరూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

# టాలీవుడ్‌లో రితికా నాయక్ హవా..

టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ రితికా నాయక్ ప్రస్తుతం టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ చిత్రంలో చైత్ర అనే మోడరన్ పాత్రలో కనిపించిన రితికా నాయక్ తన అద్భుతమైన అభినయంతో పాటు అందచందాలతో కుర్రకారును ఎంతగానో ఫిదా చేస్తున్నారు. తెరపై ఆమె లుక్స్, పెర్ఫార్మెన్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.అయితే కెరీర్ ప్రారంభం నుండి వరుస విజయాలను సొంతం చేసుకుంటూ వస్తున్న ఈ అమ్మడు, టాలీవుడ్‌లో తిరుగులేని 'గోల్డెన్ హ్యాండ్' లేదా 'లక్కీ ఛార్మ్' అనే ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అశోక వనములో అర్జున కల్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన రితికా నాయక్, ఆ తర్వాత వచ్చిన చిత్రాలతోనూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్నారు. ఏ పాత్రనైనా తన సహజమైన నటనతో రక్తికట్టించగల నటిగా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీకి, ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తూ, కథాబలమున్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న రితికా నాయక్ భవిష్యత్తులో మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.





# నా జీవితాన్ని ఒక్కరి కోసం మార్చుకోలేను..

ఒకప్పుడు తెలుగు, హిందీ చిత్రాల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న అమీషా పటేల్ మరోసారి తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 51 ఏళ్ల వయసులోనూ అవివాహితగా కొనసాగుతున్న ఆమె, పెళ్లి గురించి తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. తాను ఎప్పటికీ పెళ్లి చేసుకోనని, ప్రస్తుతం సింగిల్ జీవితంతో ఎంతో సంతోషంగా ఉన్నానని చెప్పారు. తాజాగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అభిమానులతో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' (ఇూహీఇూ) సెషన్‌లో ఓ అభిమాని.. మీరు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? అని ప్రశ్నించాడు. దీనికి ఏమాత్రం సందేహించకుండా అమీషా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. నేను ఎప్పటికీ పెళ్లి చేసుకోను. సింగిల్‌గా చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ప్రేమించే కుటుంబ సభ్యులు, స్నేహితులు నాకు చాలామంది ఉన్నారు. ఒక్క వ్యక్తి కోసం నా జీవితాన్ని, నా ఆనందాన్ని పూర్తిగా మార్చుకోవాలని నేను అనుకోవడం లేదు అని ఆమె సమాధానం ఇచ్చారు. అమీషా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె అభిప్రాయానికి కొందరు నెటిజన్లు మద్దతు తెలుపుతూ.. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉందని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం పెళ్లి అనేది పరస్పర అవగాహన, ప్రేమ, సహజీవనానికి ప్రతీక అని అభిప్రాయపడుతున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో అమీషా పటేల్ తన ప్రేమ జీవితం గురించి కూడా మాట్లాడారు. సినీ రంగంలోకి రావడం తన అప్పటి ప్రియుడికి ఇష్టం లేకపోవడంతో ఆ బంధం ముగిసిందని ఆమె వెల్లడించారు. ఆ అనుభవం తన జీవితంలో చాలా విషయాలు నేర్పిందని చెప్పారు. అలాగే, తన కెరీర్‌ను అర్థం చేసుకుని ప్రోత్సహించే వ్యక్తి దొరికితే పెళ్లి గురించి ఆలోచించేవారినని, కానీ అలాంటి మానసిక పరిణతి ఉన్న భాగస్వామిని కనుగొనడం సులభం కాదని పేర్కొన్నారు. వయసు కంటే వ్యక్తిత్వం, ఆలోచనా విధానమే ముఖ్యమని కూడా ఆమె అభిప్రాయపడ్డారు.అమీషా పటేల్ ఇటీవల సన్నీ డియోల్ సరసన నటించిన 'గదర్ 2' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్నారు. సకీనా పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించింది. అనంతరం 'తౌబా తేరా జల్వా' చిత్రంలో కనిపించిన అమీషా, ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్ట్‌లపై దృష్టి సారిస్తున్నారు.

# సెకండ్ ఇన్నింగ్స్ పై రాజశేఖర్ ఏమన్నారంటే...!

సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను ఉత్సాహంగా ప్రారంభించారు. కథాబలం ఉంటే హీరో పాత్రలే కాదు, సహాయ నటుడిగా కనిపించడానికీ తాను సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇటీవల విడుదలైన 'బైకర్' చిత్రంలో తన పాత్రకు ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణ పట్ల రాజశేఖర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై కథకు ప్రాధాన్యమున్న పాత్రలు వస్తే చేయడానికి వెనుకాడనని తెలిపారు. నటుడు ఎప్పుడూ నటుడే. మంచి పాత్ర దొరికితే తనను తాను నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉంటాడు అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 60 ఏళ్లు దాటినా ఇప్పటికీ యంగ్‌గా, ఎనర్జిటిక్‌గా కనిపించడం వెనుక ఉన్న రహస్యాన్ని కూడా రాజశేఖర్ పంచుకున్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలే తన ఫిట్‌నెస్‌కు కారణమని చెప్పారు. ముఖ్యంగా పుచ్చకాయ, ఆపిల్, ఆరెంజ్ పండ్ల రసాల మిశ్రమాన్ని ప్రతిరోజూ తీసుకుంటానని, దీనితో పాటు క్రమం తప్పని వ్యాయామం తనలో శక్తిని నింపుతుందని వివరించారు. ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో తన భార్య జీవిత పాత్ర ఎంతో కీలకమని రాజశేఖర్ తెలిపారు. కెరీర్‌లోని ఒడిదొడుకులను అధిగమించడంలో ఒకరికొకరు అర్థం చేసుకుని అండగా నిలవడమే తమ బంధంలోని బలమని ఆయన పేర్కొన్నారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098.
Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com